క్లుప్తంగా

కూలీల సంఖ్య పెంచాలి



ఉపాధి పనులు పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సాయన్న

ఇంద్రవెల్లి: ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. మండలంలోని కొబ్బయ్‌గూడ చెరువులో కొనసాగుతున్న ఉపాధి పనులను మంగళవారం పరిశీలించారు. కూలీలు, అధికారులతో మాట్లాడి ఉపాధి పనుల వివరాలను తెలుసుకున్నారు. అడిగిన వారందరికి ఉపాధి పని కల్పించాలన్నారు. అదేవిధంగా పని ప్రదేశంలో కూలీలకు సమస్య రాకుండా చూడాలన్నారు. ఏపీవో జాదవ్ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ మహేందర్, సిబ్బంది సంతోష్ ఉన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

నేరడిగొండ: రైతులకు ఉపయోగపడే పనులను ఉపాధి కూలీల ద్వారా చేపడుతున్నామని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. మండలంలోని నాగమల్యాల్ గ్రామంలో ఉపాధి కూలీలు చేపడుతున్న నీటి నిల్వ కుంటల పనులను మంగళవారం పరిశీలించారు. అడిగిన వారందరికీ కూలీ పనులు కల్పిస్తామన్నారు. ఎక్కడైన సంబంధిత ఎఫ్ఏలు, టీఏలు పొరపాట్లు చేస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఇఫ్తార్‌కు హాజరైన డీసీసీబీ చైర్మన్



పాల్గొన్న భోజారెడ్డి, తదితరులు

కైలాస్‌నగర్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల అనంతరం పండ్లు స్వీకరించి ఉపవాస దీక్షలు విరమించారు. డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ముడుపు దామోదర్‌రెడ్డి, నాయకులు రషీద్ ఉల్ హక్, ఖయ్యూమ్, గంగారెడ్డి, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



ప్రవచనలు బోధిస్తున్న నారాయణ మహారాజ్

ఇంద్రవెల్లి: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని గురువు నారాయణ మహారాజ్ అన్నారు. మండల కేంద్రంలోని హనుమాన్ మందిరం వద్ద నిర్వహిస్తున్న సప్తాహ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై భక్తులకు ప్రవచనాలు బోధించారు. గ్రామపటేల్ మారుతి డోంగ్రె, మారుతి మహారాజ్, గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలి

బేల: మండలకేంద్రంలోని కీర్తన డిగ్రీ కళాశాల విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిగ్రీ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఏబీవీపీ జిల్లా ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ శివనీత్‌వార్ ఓంప్రకాశ్ మాట్లాడుతూ ఈనెల 13 నుంచి ప్రారంభమయ్యే డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు బేలలోనే పరీక్ష కేంద్రం కేటాయించేలా కేయూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని విన్నవించారు. ఆదిలాబాద్ పరీక్ష కేంద్రంతో రాకపోకలకు గంటల తరబడి తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోందని తెలిపారు. ఏబీవీపీ నాయకులు మాడవార్ హరిష్‌రెడ్డి, అక్షయ్, సాయి, గజానన్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరా పరిశీలన

ఇచ్చోడ: మండలంలోని సల్యాద పంచాయతీ పరిధిలోని అనుబంధ గ్రామం జగ్‌నపూర్‌లో నీటి సరఫరాను మండల ప్రత్యేక అధికారి ఏడీఏ పుల్లయ్య, ఎంపీడీవో లక్ష్మణ్ మంగళవారం పరిశీలించారు. ప్రతీరోజు మంచి నీటి సరఫరా అవుతున్న తీరును గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

ఇచ్చోడ: మండలంలోని దుబార్‌పేట్‌లో పశువైద్యసిబ్బంది శేఖర్, దేవురావు మంగళవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. యజమానులు పశువులకు ఈ టీకాలు వేయాలన్నారు.

అవగాహన లేక అమ్మేస్తున్నారు..

- యథేచ్ఛగా ఫోర్టిఫైడ్ బియ్యం దందా



వాంకిడిలో రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న దృశ్యం

నేరడిగొండ: చౌకధరల దుకాణాల్లో గతేడాది నుంచి బియ్యంలో పోషకాలు కలుపుతున్నారు. ఇది తెలియక చాలా మంది ప్లాస్టిక్ బియ్యం అనుకొని రేషన్ బియ్యాన్ని వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ప్రజలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అన్ని రైస్‌మిల్లుల్లో బ్లెండింగ్ యూనిట్లు ఏర్పాటు చేయించింది. సాధారణ బియ్యంలో పోషకాలు జతచేసి లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. క్రమం తప్పకుండా ఈ బియ్యం వాడితే మహిళల్లో రక్తహీనత తగ్గుతుందని ప్రభుత్వం పేర్కొంటుంది. జిల్లావ్యాప్తంగా 1,91,678 కార్డు దారులకు ప్రతినెలా 4063 మెట్రిక్ టన్నుల బియ్యం అందజేస్తున్నారు.

పోషకాల భాండారం..

పోషకాల బియ్యంలో బీ–12, ఐరన్, పోలిక్ యాసిడ్లు ఉంటాయి. ఇవి నరాల పటిష్టతకు, రక్తం వృద్ధి చెందడానికి, మెదడు సక్రమంగా పనిచేయడానికి ఉపయోగపడుతాయి. వీటినే పాఠశాల విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి, అంగన్‌వాడీలకు సరఫరా చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇటీవల పాఠశాల విద్యార్థుల్లో రక్తపరీక్షలు చేయగా వెయ్యికి పైగా మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. అలాగే 15వేల పైచిలుకు మంది మహిళలు ఈ సమస్య ఎదుర్కొంటున్నట్లు పేర్కొంటున్నారు. వీటిని తలసేమియా వ్యాధిగ్రస్తులు మినహా అందరు తినవచ్చు. తలసేమియ వ్యాధిగ్రస్తుల్లో రక్తకణాలు కొడవలి ఆకారంలో ఉండడంతో నరాల్లో ఆగిపోయే ప్రమాదం ఉంది. అందుకే వారికి ఈ బియ్యం అందించవద్దు.

రేషన్ బియ్యంలో పోషకాలు..

సాధారణ బియ్యం తినడంతో శరీరానికి అంతగా పోషకాలు అందవు. అందుకే ప్రభుత్వం సాధారణ బియ్యంలో పోషకాలు కలుపుతోంది. 99 కిలోలకు బియ్యానికి ఒక కిలో పోషకాలు జత చేస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా రైస్ మిల్లుల్లోనే పూర్తవుతుంది. బియ్యం వండేముందు కడిగేటప్పుడు నీటి మీద కొన్ని గింజలు తేలుతాయి. వాటిని ప్లాస్టిక్‌గా భావించి బయట పడేస్తున్నారు. కానీ అలా తేలేవే పోషకాల బియ్యం. ఇలా తేలినప్పుడు పక్కకు తీసి మిగిలిన బియ్యం కడగాలి. ఆ తర్వాత పక్కన తీసిన వాటిని కలుపుకొని వండుకోవాలి. వీటిని ప్రాధాన్యం తెలియక చాలామంది లబ్ధిదారులు కిలో రూ.16 నుంచి రూ.20 చొప్పున వ్యాపారులకు అమ్మేస్తున్నారు. మరికొందరు టిఫిన్ సెంటర్ల వారికి విక్రయిస్తున్నారు. రేషన్ పంపిణీ చేసే సమయంలో ప్రతీనెల 1 నుంచి 15వ తేదీల్లో ఈ దందా కొనసాగుతోంది.

ప్రతిఒక్కరూ తినాలి..

ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రేషన్ బియ్యంలో పోషకాలు కలుపుతోంది. పాఠశాలలు, లబ్ధిదారులకు ఇవే సరఫరా చేస్తున్నాం. ఇందులో బీ–12, ఐరన్, పోలిక్ యాసిడ్లు ఉంటాయి. ప్రతి ఒక్కరూ పోషకాల బియ్యం తినడానికి ప్రాధాన్యం ఇవ్వాలి.– కిరణ్‌కుమార్, డీఎస్ఓ, ఆదిలాబాద్

కొలాంగూడలో తాగునీరందిస్తాం

- డీఆర్‌డీవో సాయన్న

సాక్షి స్పందన



నీటిని ప్రారంభిస్తున్న అధికారులు, వనవాసీ కళ్యాణ పరిషత్ నిర్వాహకులు

ఇంద్రవెల్లి: మండలంలోని గట్టెపల్లి పంచాయతీ పరిధి కొలాంగూడ గ్రామంలో నీటి ఎద్దడితో గిరిజనులు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ సాక్షిలో మంగళవారం 'నీటి ట్యాంకర్లే దిక్కు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన డీఆర్‌డీవో సాయన్న, అధికారులతో కలిసి కొలాంగూడను సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. టికిడిగూడ సమీపంలో వ్యవసాయ బావి నుంచి గ్రామం వరకు పైప్‌లైన్ చేసి తాగునీరందిస్తామని కొలాం గిరిజనులకు హామీఇచ్చారు. అదేవిధంగా వనవాసీ కళ్యాణ పరిషత్ ట్రస్ట్ నిర్వాహకులు కొలాంగూడలోని బావిలో పంప్‌సెట్‌ను అమర్చి నీటిని సరఫరా చేశారు. ఇందుకు 'సాక్షి' చూపిన చొరవను ఆదివాసీలు, గిరిజనులు అభినందించారు. ఎంపీడీవో భాస్కర్, వనవాసీ కళ్యాణ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మెస్రం జంగు, మండల అధ్యక్షుడు మాణిక్ రావ్, సభ్యుడు సంతోష్, పంచాయతీ కార్యదర్శి కవిందర్, గ్రామస్తులు ఉన్నారు.

కార్యకర్తలే పార్టీకి బలం

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

బేల: కార్యకర్తలే బీజేపీ పార్టీకి బలమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని గణేశ్‌గార్డెన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బూత్‌స్థాయి నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన బూటకపు హామీలు ఇప్పుడు ప్రజల్లోకి ఇంటింటికి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ 30ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నారని, అవినీతి మచ్చ లేని నాయకుడిగా ఎదగారని తెలిపారు. ఆయన గెలిపించేలా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. అనంతరం బీఆర్ఎస్‌కి చెందిన బేల, మణియార్‌పూర్ మాజీ సర్పంచులు ఇంద్రశేఖర్, తేజ్‌రావుతోపాటు పలువురు బీజేపీలో చేరగా, ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోయర్ విజయ్, మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, నాయకులు ఠాక్రే మురళీధర్, బోనిగిరివార్ గణేశ్, రామెల్లి మోరేశ్వర్, ఠాక్రే సందీప్, సలాం దేవ్‌రావు, ధర్నే జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

జైనథ్: పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని నిరాల గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి గొడం నగేశ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఇంటింటా తీసుకెళ్లాలని సూచించారు. ఎంపీ అభ్యర్థి గొడం నగేశ్ మాట్లాడుతూ గుడిసెలో రామునికి గుడికట్టిన ప్రధాని మోదీ మరోసారి ప్రధాని ఎన్నుకోవడం అందరి బాధ్యత అన్నారు. అనంతరం పాయల్ శంకర్, గొడం నగేశ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.అశోక్, భోయర్ విజయ్, మయూర్‌చంద్ర, జ్యోతిరెడ్డి, అస్తక్ సుభాష్, కట్కం రాందాస్, కరుణాకర్‌రెడ్డి, చంద్రకాంత్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ ఆశయసాధనకు కృషి



ఆదిలాబాద్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్, తదితరులు

ఆదిలాబాద్: బహుజనుల రాజ్యాధికారం కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన కృషి గొప్పదని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట మంగళవారం ఆయన వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ నాయకులు లాలామున్నా, బోయర్ విజయ్, మయూర్ చంద్ర, అశోక్, గౌడ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

చిల్డ్రన్ వార్డులో పండ్ల పంపిణీ..

ఆదిలాబాద్‌టౌన్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని సర్దార్ గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. రిమ్స్‌లోని చిల్డ్రన్ వార్డులో మంగళవారం పిల్లలకు బిస్కెట్లు, పండ్లు, జ్యూస్‌లు పంపిణీ చేశారు. పాపన్నగౌడ్ చేసిన సేవలను రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ కొనియాడారు. వైద్యులు ఇద్రిస్ అక్రాని, హేమలత, తిరుమల్ రెడ్డి, గౌడ యువజన సంఘం అధ్యక్షుడు గజానన్, అనిల్, ఈశ్వర్, గణేశ్, భూపతి, చరణ్‌గౌడ్, లక్ష్మీనారాయణ, సంతోష్‌గౌడ్, భూమగౌడ్, దినేష్ పాల్గొన్నారు.

రజకుల సంక్షేమానికి కృషి

ఆదిలాబాద్‌రూరల్: రజకుల సంక్షేమానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని సంఘ భవనంలో పట్టణ రజక సంఘం సభ్యులు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మల్కుల్‌వార్ సంతోష్, ముస్కు వినోద్‌లను ఎమ్మెల్యే సన్మానించారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, బీజేపీ నాయకులు విజయ్, మయూర చంద్ర, చిలుకూరి జ్యోతిరెడ్డి, అశోక్ తదితరులు ఉన్నారు.

నేడు హనుమాన్ దీక్షల స్వీకరణ

బేల: మండలంలోని సిర్సన్న శివారులోని సింగాపూర్ హనుమాన్ ఆలయంలో బుధవారం 21 రోజుల అర్ధమండల హనుమాన్ దీక్షల స్వీకరణ ఉంటుందని పూజారి దినేష్‌చౌదరి పేర్కొన్నారు. 13న 11రోజుల దీక్షల స్వీకరణ ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆయా తేదీల్లో స్వీకరించవచ్చని పేర్కొన్నారు. 23న హనుమాన్ జయంతిరోజు దీక్షల మాల విరమణ ఉంటుందని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



చేతిపంపు పరిశీలిస్తున్న సామ రూపేష్‌రెడ్డి

బేల: ఏజెన్సీ ప్రాంతంలోని గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని యూత్ కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జామ్డ గ్రామంలో మంగళవారం ఆయన ఆదివాసీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలాచోట్ల నీళ్లు, రోడ్లు, తదితర సమస్యలు ఉన్నాయని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపొందాక వెంటనే సమస్యలు పరిష్కరిస్తామన్నారు. నాయకులు ప్రమోద్‌రెడ్డి, గ్రామపటేల్ సంబు, చిన్ను, కినక ఆనంద్, కిష్టు, లచ్చు, వాగు తదితరులు పాల్గొన్నారు.

నేడు శనగ కొనుగోళ్లు ప్రారంభం

నేరడిగొండ: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో శనగ కొనుగోళ్లను బుధవారం నుంచి ప్రారంభమవుతాయని ఆ సంఘం చైర్మన్ సాబ్లే కిశోర్‌సింగ్, సీఈవో బారే నాగభూషణం ఓ ప్రకటనలో తెలిపారు. బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదేశాల మేరకు ఉదయం 9 గంటలకు ఈ కొనుగోళ్లను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.5,440 ఉంటుందని తెలిపారు. రైతులు తమ శనగ పంటను విక్రయించుకోవాలని కోరారు.

సరుకులు పంపిణీ



పేద ముస్లింలకు సరుకులు అందజేస్తున్న సొసైటీ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: రంజాన్ పండగను నిరుపేద ముస్లింలు సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో దారుల్ అన్సార్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమని హజ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు షాహిద్ అహ్మద్ తవక్కల్ అన్నారు. పట్టణంలోని సెంట్రల్ గార్డెన్‌లో దారుల్ అన్సార్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం సరుకులు పంపిణీ చేశారు. మహ్మద్ ఆసిఫొద్దీన్, ఖీజర్ అహ్మద్, ఆరిఫ్‌ఖాన్, అతాఉల్లాహ్, అమిన్ షరీఫ్, షేక్ మోయిజ్, అస్మత్ అలీ, షేక్ అజ్జు హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

ఆదిలాబాద్‌రూరల్: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటల రాములు అన్నారు. మండలంలోని భీంసరి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికులతో మంగళవారం ఆయన మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నభోజన కార్మికులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇప్పటివరకు కార్మికులకు నయా పైసా చేయూతనివ్వలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్మికులు బత్తుల సునీత, ఆశమ్మ, రాజేశ్వరి, అనిత, అనసూయ తదితరులు ఉన్నారు.

వేధింపులకు గురిచేస్తే సమాచారం అందించాలి

ఆదిలాబాద్‌టౌన్: ఆకతాయిలు వేధింపులకు గురిచేస్తే సమాచారం అందించాలని సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాల, ఐటీఐ కళాశాలల్లో మంగళవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలకు వచ్చివెళ్లే సమయంలో పోకిరీలు వేధింపులకు గురిచేస్తే డయల్ 100, 181, 1930 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పోక్సో, గృహ హింస, బాల్య వివాహ నిరోధక చట్టం, స్మార్ట్‌ఫోన్‌తో కలిగే లాభాలు, నష్టాల గురించి విద్యార్థులకు వివరించారు. డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, సుజాత, శ్రీనివాస్, మహిళా సాధికారత కోఆర్డినేటర్ యశోద, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

జైనథ్: మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన పెంచుకోవాలని మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ యశోద అన్నారు. సఖీ కేంద్రం, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యాన మండలంలోని గిమ్మ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బేటి బచావో.. బేటి పడావో పథకం, లింగ నిర్ధారక నిరోధక, గృహహింస చట్టం, పని ప్రదేశంలో లైంగిక వేధింపులు, లింగ వివక్షత, తదితర అంశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ సుచల, సఖీ కేంద్రం నిర్వాహకులు సరస్వతి, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి'

ఎదులాపురం: వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లంక రాఘవులు అన్నారు. జిల్లాకేంద్రంలోని సుందరయ్య భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సంక్షేమాన్ని కేంద్రంలోని బీజేపీ సర్కారు విస్మరిస్తోందని మండిపడ్డారు. కార్మిక చట్టాలను సవరిస్తూ కార్మికులను కట్టుబానిసలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు అందించాలన్నారు. రోజువారీ కూలీ రూ.350 అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సంఘం నాయకులు స్వామి, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పనులు

- మామిడిగూడ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో భవన నిర్మాణాలు
- రూ.30 లక్షల నిధులు మంజూరు



పాఠశాలలో చేపడుతున్న భవన నిర్మాణ పనులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని మామిడిగూడ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో వాటిలో రెండు నుంచి మూడింటిని కూల్చివేశారు. 2011లో రాజీవ్ విద్యామిషన్ నిధులతో గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్తు కలుపుకొని 8 గదులు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించి పనులు ప్రారంభించారు. కొంతమేర తర్వాత మధ్యలో పనులు నిలిపివేశారు. పాఠశాలలో గతేడాది వసతిగృహాన్ని అప్పటి ఐటీడీఏ పీవో తనిఖీ చేశారు. ఆవరణలో భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉండడంపై ఆరా తీశారు. నిధులు లేకనే పనులు నిలిపివేసినట్లు ఐటీడీఏ ఇంజినీర్ అధికారులు తెలిపారు.

మూడునెలల క్రితం పనులు

ఇదిలా ఉంటే అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాల కోసం ఐటీడీఏ ఉన్నతాధికారులు రూ.30 లక్షలు నిధులు మంజూరు చేశారు. మూడు నెలల క్రితం పనులు చేపట్టారు. ప్రస్తుతం కొనసాగుతున్నాయి. ఈ మేరకు ×సాక్షి౹ఐటీడీఏ ఇంజినీర్ అధికారులను ఫోన్‌లో సంప్రదించగా త్వరలో పనులు పూర్తి కానున్నాయని పేర్కొన్నారు. వచ్చే విద్యాసంవత్సరం విద్యార్థులకు నూతన భవనం ఉపయోగంలోకి రానుందని తెలిపారు.

గతంలో క్రీడా పాఠశాలకు ప్రతిపాదనలు

జిల్లాలో ఉట్నూర్, జాతర్లలో రెండు బాలుర గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలు ఉన్నాయి. బాలికలకు మాత్రం జిల్లాలో క్రీడా పాఠశాలల్లేవు. అయితే ఆదిలాబాద్ రూరల్ మండలం మామిడిగూడ బాలికల ఆశ్రమ పాఠశాలకు విశాల స్థలం ఉండడంతో బాలికల క్రీడా పాఠశాల ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు.

పాఠశాలలో అవకాశం..

ఈ పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు గిరిజన విద్యార్థులు చదువుకునేందుకు అవకాశం ఉంది. ఆయా తరగతులు కలుపుకొని మొత్తం 600 మంది అడ్మిషన్లు తీసుకోవచ్చు. ప్రస్తుత విద్యాసం వత్సరంలో టెన్త్ విద్యార్థులను కలుపుకొని 336 మంది చదువుకుంటున్నారు.

నిర్భయంగా ఓటు వేయాలి



ఓటరు అవగాహనపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, తదితరులు

ఇచ్చోడ: ఎన్నికల్లో అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రెయినీ కలెక్టర్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండినవారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. యువత, స్వచ్ఛంద సంస్థలు గ్రామీణ ప్రాంతాల్లో ఓటు హక్కుపై అవగాహన కల్పించాలన్నారు. తహసీల్దార్ తుకారాం, ఎంపీడీవో లక్ష్మణ్, ఎంఈవో ఉదయ్‌రావు, కార్యదర్శులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

నేరడిగొండ: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని ఇచ్చోడ సీఐ భీమేష్, ఎస్సై శ్రీకాంత్ అన్నారు. మండలంలోని లింగట్ల గ్రామంలో మంగళవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఫ్లాగ్‌మార్చ్‌లో పోలీసులు

పైపులైన్ లీకేజీ..వృథాగా నీరు



ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని మిలింద్‌నగర్ వడగామ్ రోడ్డు పక్కనే మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో నీరు వృథాగా పోతోంది. ఓ వైపు వేసవిలో ప్రతీరోజు నీరు రాక ఇబ్బంది పడుతుంటే.. మరోవైపు పైపులైన్ లీకై వృథాగా నీరు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. రోడ్డుపై నీరు చేరడంతో ప్రయణికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైన అధికారులు పైప్‌లైన్ మరమ్మతు చేసేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.